క్లుప్తంగా

ఊరూరా సంతకాల సేకరణ

రఘునాథపల్లి: ఓట్ల చోరీపై ఊరూరా సంతకాల సేకరణ చేపట్టాలని కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు పేర్ని ఉష పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ మహిళా నాయకులతో కలిసి ఆమె ఇంటింటా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు పేర్ని రేణుక, కేమిడి నర్సమ్మ, భూక్య సరిత, కె.స్వప్న, మాధవి, దీపిక పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న అమృతమ్మ, రేణుక

రఘునాథపల్లి: ఇంటి స్థలాన్ని నకిలీ ప్రత్రాలతో అక్రమించుకోవాలని యత్నిస్తున్న వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మండలంలోని ఖిలాషాపూర్‌కు చెందిన బాధితురాలు ఎలుమకంటి అమృతమ్మ కోరారు. సోమవారం ఇంటి స్థలం అవరణలో ఆమె ఒక్కగానొక్క కూతురు రేణుక, అల్లుడు కృష్ణాకర్‌తో కలిసి విలేకరులకు గోడువెళ్లబోసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఖిలాషాపూర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భర్త వెంకటయ్యకు ఇంటి కోసం 200 గజాల స్థలం కేటాయించారని అమృతమ్మ పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇదే స్థలంలో రెండు గదులను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ స్థలంను నకిలీ పత్రాలతో దాయాదులకు చెందిన వారు ఆక్రమణకు యత్నించగా తన కూతురు, అల్లుడు అడ్డుకోవడంతో తమపై దాడి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తప్పుడు డాక్టర్ సర్టిఫికెట్లను పోలీస్‌స్టేషన్‌లో సమర్పించడంతో తన అల్లుడు కృష్ణాకర్‌ను 14 రోజులు రిమాండ్ చేశారని అమృతమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలపై..



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ వెంకట్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీధర్, హరి, సతీష్, యశ్వంత్ పాల్గొన్నారు.

నేడు 'వేద'లో స్వర్ణప్రాశన

జనగామ: పట్టణంలో హైదరాబాద్ రోడ్డు బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ ఆస్పత్రిలో ఈనెల 14వ తేదీన పిల్లలకు ఉచిత స్వర్ణప్రాశన వేయనున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ నెల పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని 6 నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు యువకులకు స్వర్ణ ప్రాశణ వేస్తున్నామన్నారు. దీని వల్ల పిల్లల్లో కండరాలు, ఎముకల పటిష్టత, మేధాశక్తి, జీర్ణ శక్తి పెరుగుతుందన్నారు.

రేపటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

చిల్పూరు: మండలంలో ఈనెల 15 నుంచి నవంబర్ 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ తెలిపారు. మండలంలోని మల్కాపూర్ పశువైద్య కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో నిర్వహించే కార్యక్రమంలో రైతులు ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు.

వీధిలైట్ల నిర్వహణపై పట్టింపేది?

● మెజారిటీ గ్రామాల్లో పట్టపగలే వెలుగులు

లింగాలఘణపురం: సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి రెండేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో అసలు పంచాయతీలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. నామ్‌కే వాస్తేగా ఉన్న కార్యదర్శులు తమ వృత్తి ధర్మం కోసం పని చేస్తున్నారే కాని అసలు సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎందుకంటే ప్రతి పని ఆర్థిక విషయాలతో ముడిపడి ఉండడంతో ఎవరూ ముందుకు సాగడంలేదు. ఇప్పటికే తమ జేబుల్లో నుంచి ఖర్చులు పెడుతున్నామంటూ లబోదిబోమంటూ మొత్తుకుంటున్నారు. 2023లో గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణను రెడ్‌కో అనే సంస్థ చేపట్టి పాత లైట్ల స్థానంలో తమ లైట్లను ఏర్పాటు చేసి బలవంతంగా నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. ప్రభుత్వం మారడం, సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో అసలు వాటి జోలికే వెళ్లడం లేదు. పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేస్తే అసలు పట్టించుకోవడమే లేదు. దీంతో మండలంలోని 21 పంచాయతీలకు మెజారిటీ గ్రామాల్లో నెలల తరబడి వీధి లైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. మరి కొన్ని గ్రామంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. 24 నాలుగు గంటలు వీధిలైట్లు వెలుగడంతో విద్యుత్ బిల్లులు పెరుగుతూ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇదంతా పరోక్షంగా ప్రజలపై పడుతున్న భారాన్ని అటు పంచాయతీ కార్యదర్శులు గాని, ఇటు ప్రభుత్వం కాని దృష్టి పెట్టడంలేదు. మండలంలోని చీటూరు, కిష్టగూడెం, గుమ్మడవెల్లి, జీడికల్, సిరిపురం, క్లైం, నెల్లుట్ల, బండ్లగూడెం తదితర గ్రామాల్లో నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.



కళ్లెంలో నిరంతరం వెలుగుతున్న వీధిలైటు

పండుగకు మేమే ఏర్పాటు చేసుకున్నాం



వీధిలైట్ల నిర్వహణ అసలు పట్టించుకోవడంలేదు..గతంలో రెడ్‌కో సంస్థ బలవంతంగా గ్రామ పంచాయతీ లైట్లను తొలగించి వారే ఏర్పాటు చేశారు. నేడు ఆ లైట్లను ఎవరూ పట్టించుకోవడంలేదు. వీధుల్లో చీకటిగా ఉండడంతో పండుగ వేళల్లో తామే స్వయంగా ఏర్పాటు చేసుకున్నాం.

\- ఐల మల్లేశం, చీటూరు మాజీ సర్పంచ్

జీపీల ఆధ్వర్యంలో లేదు

వీధిలైట్ల నిర్వహణ గతంలో పంచాయతీలకు ఉండేది. మూడేళ్లుగా మరో సంస్థలకు అప్పగించడంతో థర్డ్‌వైర్ ఫేయిల్ అయిన చోట్ల ట్రాన్స్‌కో మరమ్మతులు చేయడంలేదు.

\- రఘురామకృష్ణ, ఎంపీడీఓ, లింగాలఘణపురం

థర్డ్ పార్టీ ఏజెన్సీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న యాటల సోమన్న

జనగామ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలో థర్డ్‌పార్టీ ఏజెన్సీలను రద్దు చేసి నేరుగా వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారానే వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొట్ల వెంకటేశ్ అధ్యక్షతన పట్టణంలో జిల్లా 2వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుల శ్రమను కారుచౌకగా దోచుకుంటున్నారని, రాష్ట్రంలో అనేక థర్డ్ పార్టీ ఏజెన్సీలు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా జాప్యం చేస్తుండటంతో గార్డులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ సెక్యూరిటీ గార్డులకు గుర్తింపు లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్, వెంకటరమణ సత్యనారాయణ, కుమార్, ప్రవీణ్, నిరోషా ,రమేష్ ,శ్రీనివాసు, సమీనా పాల్గొన్నారు.

అబ్జర్వర్ పట్నాయక్‌ను కలిసిన 'పెద్ది' టీమ్



దేవరుప్పుల: సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియ పరిశీలించేందుకు వచ్చిన ఏఐసీసీ, టీపీసీ పరిశీలక బృందాన్ని పెద్ది టీమ్ సభ్యులు కలిసి తమ అభిప్రాయాల్ని తెలిపినట్టు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాశ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో పార్టీ బలోపేతం, ప్రజా నాయకత్వపు పురోగతి కోసం పరిశీలనకు వచ్చిన ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ ప్రతినిధులు ఎమ్మెల్యే శంకరయ్య, ఎం.డీ అవేజ్, శ్రీకాంత్ యాదవ్ తదితర విభాగాల ప్రతినిధులతో గత ఏడాది నుంచి పాలకుర్తిలో చోటుచేసుకున్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ పరిణామాలపై వివరించామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహేందర్‌జీ, చెన్నూరు రాంబాబు, గొడిశాల శ్రీనుగౌడ్, కారుపోతుల యాకయ్య, సతీష్, తోటకూరి మహేష్, తాళ్లపల్లి ఉపేందర్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్‌లో చేరికలు అవాస్తవం'

కొడకండ్ల: కడగుట్ట తండాలోని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారనే ప్రకటనలు అవాస్తవమని బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మంచ నాయక్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో కనీస సభ్యత్వంలేని భీమానాయక్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారని కాంగ్రెస్ నాయకులు ఉనికి కోసం పాటుపడే తీరు సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పడ ఖాయమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి ధరావత్ శ్రీను, మాజీ సర్పంచ్ రమాదేవి, మోహన్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు భూక్యా మంగ్య నాయక్, సీనియర్ నాయకులు ధరవాత్ సూర్య, దంజి లాల్, భూక్యా యాకు, యాకన్న, శ్రీను, బానోత్, ఉపేందర్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ



జనగామ రూరల్: పోషణ మాసోత్సవంలో తల్లులు

లింగాలఘణపురం: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం అందరూ తీసుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని లింగాలఘణపురం సెక్టార్ పరిధిలో జరిగిన పోషణ మాసోత్సవంలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా లభించే ఆహార పదార్థాలల్లో పోషకాలు ఎక్కువగా ఉండే వాటిని తీసుకోవాలని, సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూచించారు. డాక్టర్ స్వర్ణలత, సలీమా, ఏపీఎం నాగేశ్వర్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హంసమ్మ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవం

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్ అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని టీచర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆసర్ల తేజశ్రీ, కాళి మౌనిక 69వ స్కూల్‌గేమ్స్ అండర్–17 బాలిక విభాగంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న వరంగల్‌లో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్‌ను, ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. అదేవిధంగా పీవీఆర్ పాఠశాలకు చెందిన కొమ్ము సహానిక అండర్–14 విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14న ములుగు జిల్లా జాకారంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో జనగామ జిల్లా నుంచి పాల్గొంటుందని వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



జనగామ: చెక్కు అందజేస్తున్న నాయకులు

జనగామ: పట్టణంలోని 20వ వార్డు చెందిన కర్రె యాదగిరి మంజూరైన రూ.30వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ జూకంటి లక్ష్మి శ్రీశైలం, వార్డు అధ్యక్షుడు దావెర రాజు, ప్రధాన కార్యదర్శి జాయ శ్రీశైలం బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారని తెలిపారు.

బియ్యం..



జఫర్‌గఢ్: బియ్యం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన భాష బోయిన అంజయ్య ఇటీవల మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు 50 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎండీ వలీపాష, దుస్స రాములు, ఎదులాపురం జయశంకర్, గాదెపాక శ్రీను, సురేష్‌గౌడ్, కాల్వ రవి, యాకలక్ష్మి, వల్లాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వన్యప్రాణులకు రక్షణ కరువు

● అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం

● వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న మూగజీవాలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ పరిధిలో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతోంది. సంబంధిత అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో అరుదైన వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీస్ పరిధిలో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్, కొడకండ్ల, పాలకుర్తి మండలాలు వస్తాయి. ఒక ఎఫ్ఆర్ఓతో పాటు ఇద్దరు ఎఫ్ఎస్ఓ ఉండాల్సి ఉంది. అదేవిధంగా ప్రతీ మండలానికి ఒక ఎఫ్‌బీఓ ఉండాలి. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ ఏరియా రిజర్వ్ ఫారెస్టుగా ఉండటంతో ఆ ఏరియాకు ప్రత్యేకంగా ఒక బీట్ ఆఫీసర్ ఉండాల్సి ఉంది. అయితే స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు జఫర్‌గఢ్, కొడకండ్ల, పాలకుర్తి, తాటికొండకు ఒక్కడే బీట్ ఆఫీసర్ ఉండటం గమనార్హం. ఐదు మండలాలకు ఒక్కరే ఎఫ్ఎస్ఓ ఉన్నారు. దానికి తోడు ఎఫ్ఎస్ఓ, బీట్ ఆఫీసర్ స్థానికంగా అందుబాటులో ఉండరు. ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో పెద్దగా అటవీప్రాంతం లేకపోయినప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి వన్యప్రాణులు మండలంలోని నమిలిగొండ, తానేదార్‌పల్లి, ఇప్పగూడెం, అక్కపెల్లిగూడెం, కోరగుట్ట, తాటికొండ, జిట్టెగూడెం గుట్టలు,అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు కనిపిస్తుంటాయి. ప్రధానంగా నెమళ్లు, కుందేళ్లు, ఎలుగుబంట్లు, దుప్పిలు, జింకలు, అడవిపందులు సంచరిస్తుంటాయి. అదేవిధంగా వేసవికాలంలో ఇతర ప్రాంతాల నుంచి సైతం వన్యప్రాణులు మండల పరిధిలోకి వస్తుంటాయి. అయితే ఆయా ఏరియాల్లో అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేటగాళ్ళు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా ఉచ్చులు పెడుతూ వన్యప్రాణులను చంపి గుట్టుగా మాంసం విక్రయాలు చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని జంతు ప్రేమికులు, ప్రకృతి ప్రియులు ఆరోపిస్తున్నారు.

చర్చనీయాంశంగా మచ్చలదుప్పి మృతి

మండలంలోని విశ్వనాథపురంలో వేటగాళ్లు పెట్టిన ఉచ్చులో పడి అరుదైన మచ్చల దుప్పి మృతిచెందిన సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగిన సంఘనలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం విశ్వనాథపురం కెనాల్‌పడి జింక, కోరగుట్ట క్రషర్ సమీపాన ఎలుగుబంటి చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇక నెమళ్లు, అడవిపందులు, కుందేళ్ల విషయం షరామామూలుగా మారింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు బీట్ ఆఫీసర్లు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వన్యప్రాణుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, జంతు ప్రేమికులు కోరుతున్నారు.

బాలికలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న మనోజ్‌కుమార్

రఘునాథపల్లి: ప్రస్తుత సమాజంలో బాలికలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్, 1098లపై ఉమెన్‌హబ్, స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల విద్య ఆరోగ్యం, భద్రత, బాల్య వివాహాలు, మహిళ సాధికారిత, సమాజ నిర్మాణంలో బాలికల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ కేర్ వర్కర్ ప్రశాంత్, పవిత్ర, శీలరాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హేమలత, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

బీసీలను రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర

● ముదిరాజ్ మహాసభ ఇన్‌చార్జ్ లింగం



నినాదాలు చేస్తున్న బీసీ నాయకులు

తరిగొప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 9కు వ్యతిరేకంగా రెడ్డి జాగృతి నాయకులు హై కోర్టులో పిటీషన్ వేయడం బీసీలను రాజకీయంగా అణచివేసేందుకు కుట్ర జరిగిందని ముదిరాజ్ మహాసభ మండల ఇన్‌చార్జ్ చిలువేరు లింగం అన్నారు. బీసీ కులాల నాయకులతో సోమవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రెడ్డి జాగృతి నాయకుల పట్ల నిరసన వ్యక్తం చేసి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాళ్లపల్లి పోషయ్య, బూస యాదగిరి, అంకం శ్రీనివాస్, ఎదునూరి నర్సింహులు, అమిరిశెటి వెంకటయ్య, బత్తిని సురేందర్, అంకం రాజారాం, సుంకరి నర్సింహులు, నడిగోటు శ్రీధర్, కర్ణకంటి వెంకటేశ్వర్లు, సుంకరి రవి, నేతుల సత్తయ్య, రాజేంద్ర ప్రసాద్, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాలకుర్తి: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మజ్జిగ రమేశ్ (40) సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ హైదరాబాద్‌లో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, ఎల్‌బీనగర్ వద్ద ఆదివారం రాత్రి కాలినడకన ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రమేశ్ మృతదేహాన్ని అంత్యక్రియలు నిర్వహించేందుకు లక్ష్మీనారాయణపురం గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య



స్టేషన్‌ఘన్‌పూర్: కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కాంటాలను పంపిణీ చేస్తున్న లావణ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వానాకాలం సీజన్‌కు గాను గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ప్యాడీ క్లీనర్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, టార్పాలిన్లు, అసుక్రిమూవర్‌లు తదితర యంత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతగా పనిచేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని విక్రయించేందుకు ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. కిసాన్‌యాప్ ద్వారా రైతులు తమ పత్తిని విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి ఝాన్సీ, మార్కెట్ సెక్రటరీ జన్ను భాస్కర్, మార్కెట్ సిబ్బంది శ్రీనివాస్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం రవి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సౌకర్యార్థమై అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలని ఐకేపీ ఏపీఎం రవి అన్నారు. సోమవారం మండలంలోని కొడవటూర్, బసిరెడ్డిపల్లి, పోచన్నపేట, నారాయణపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం రవి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, గన్నీ బ్యాగుల కొరత కూడా ఉండబోదన్నారు. ఎంఎస్ అధ్యక్షుడు పచ్చిమడ్ల స్వప్న, సీసీలు నర్సింహులు, విజయలక్ష్మి, యాదగిరి, దేవదానం, సీఏ వాణి, ఉపేంద్ర, ప్రేమలత, యాదగిరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే జీవితం శూన్యం

● ఏఎస్పై సదానందం



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

దేవరుప్పుల: యువత మత్తుపదార్థాలకు బానిసలైతే తమ నిండు జీవితం శూన్యంగా మారుతుందని ఏఎస్పై సదానందం సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని రామరాజుపల్లిలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు సమాజ రుగ్మతలపై జాగృతి పోలీసు కళా బృందం ప్రదర్శనలు ఇచ్చి ప్రజల్ని చైతన్య పర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కన్న తల్లిదండ్రుల కలలు సాకారం చేసే దిశలో కుటుంబ ప్రయోజనంతోపాటు సమాజ హితం కోసం పాటుపడే దిశలో పయనించాలన్నారు. ఎంతటి వారైనా అతి తక్కువ సమయంలో సంసారాన్ని గుల్ల చేసుకునే పత్తాల ఆట, జీవిత లక్ష్యానికి తీవ్ర విఘాతం కల్పించే మత్తు పానీయాల్లో గంజాయి వంటి డ్రగ్స్ తమ దరికి చేరకుండా అప్రమమత్తంగా ఉండాలన్నారు. అలాంటి దురలవాట్ల ప్రభావిత వ్యక్తుల సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్య, ఆరోగ్య పరిక్షణతోనే ఆశించిన లక్ష్యాలను చేరకలుగుతారని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రామారావు, నాగమణి, వెంకటేశ్వర్లు, విలియం పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంత పరిసరాల పరిశీలన



సంత పరిసరాలను పరిశీలిస్తున్న మోహన్

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్టకు చెందిన సంత పరిసరాలను ఆలయ ఈఓ లక్ష్మీ ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుల ఆదేశం మేరకు సోమవారం జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంత స్థలంలో కోతుల వల్ల అపరిశుభ్రమైన చోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూస్తున్నామన్నారు. మేకల అంగడిలో భక్తుల కోసం నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకు పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇదే స్థలంలో గతంలో దాతలు నిర్మించిన మరుగు దొడ్లను త్వరలో భక్తుల కోసం అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. వీరన్న, మల్లికార్జున్, శేఖర్ ఉన్నారు.